# నాకేమిటి లాభం?

ఈమధ్య అలా అలవోకగా అమెరికాకి వచ్చి, అరమాసం పైన అక్కడా ఇక్కడా తిరిగి ఇండియాకి తిరిగివెళ్ళి ఓ పుస్తకం వ్రాశాడొకాయన. దానిలో తప్పేమీ లేదు. చక్కగా ట్రావెలాగులా, తన అమెరికా అనుభవాలు వ్రాస్తే బాగుండేది. కానీ అమెరికాలో ప్రజలజీవితాన్ని కాచి వడబోసినట్టు, ఊహించి వ్రాసిన విషయాలకే నా అభ్యంతరం. వాటిల్లో ఒకటి, అమెరికాలో ప్రజలు ప్రతిదానికీ "నా కేమిటి లాభం?' అనే చూస్తారని. అమెరికాలో నివసించే ఎవరికీ ఆయన చెప్పేదాకా, ఈ విషయమే తెలీదు పాపం! చూద్దాం అదెలాగో.

చాలమంది మానవ సహజమైన కొన్ని లక్షణాలని, ఒక జాతికే అన్వయించి చెబుతుంటారు. స్వార్ధం అన్నది ఓ సంస్కృతికీ దేశానికీ పరిమితమైనది కాదు. అది ఒక మానవ లక్షణం. ప్రతిచోటా స్వార్ధం లేనివాళ్ళెలా వున్నారో స్వార్ధపరులూ అలాగే వుంటారు.

"నాకేమిటి లాభం?" అనుకునే వాళ్ళు కూడా ప్రతి దేశంలోనూ సంస్కృతిలోనూ వున్నారు. మన గవర్నమెంటు ఆఫీసుల్లో చాలమందిలోనూ, మన రాజకీయ నాయకుల్లో దాదాపు అందరిలోనూ, ఏ పనిచేయాలన్నా చేస్తున్నా ఆ భావన వుండటం వల్లనే మన దేశంలో, తెలుగు దేశంలో అంత లంచగొండితనం పేరుకుపోయింది. స్వంత అన్నదమ్ములు ఆస్తులకోసం కొట్టుకు చావటం చూస్తున్నాం. ఎంతమందో మోసగాళ్ళు, ప్రతిరోజూ వాళ్ళకేమీ లాభం లేకపోతే ఆ మోసాలు ఎందుకు చేస్తున్నట్టు? ఇలాటివి అన్ని దేశాల్లోనూ వున్నాయి. కాకపోతే కొన్నిచోట్ల ఎక్కువ. కొన్ని చోట్ల తక్కువ. కొంచెం నిశితంగా పరిశీలిస్తే ఆ లాభం అన్నది చెడుకీ అవవచ్చు మంచికీ అవవచ్చు. ఆ లాభాన్ని డబ్బుతో కొలవవచ్చు, సంతృప్తితో కొలవవచ్చు, శాడిస్ట్ భావనతోనో, ఆత్మానందంతోనో కొలవవచ్చు. అది పూర్తిగా వ్యక్తిపరంగా ఎన్నో రకాలుగా వుంటుంది.

అమెరికన్ సంస్కృతిలో సాధారణంగా మేం ఇక్కడ చూస్తున్న విషయాలని, ఈ "నాకేమిటి లాభం?"అనే దృక్పధంతో చూద్దాం. కాపిటలిస్టులం కాదని చెప్పుకునే ఎన్నో దేశాల్లోనే (భారతదేశంతో సహా) డబ్బు ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నప్పుడు కాపిటలిస్ట్ దేశమయిన అమెరికాలో అదే డబ్బు ప్రధానపాత్ర వహించటంలో ఆశ్చర్యం లేదు.

ఇక్కడ చిన్నపిల్లల దగ్గరనించీ ఆర్ధికంగా వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడటం అలవాటు చేస్తారు. పిల్లలకి అలవెన్సులు ఇవ్వటం మామూలే. ఆ డబ్బులు పెట్టి వాళ్ళు కావలసినవి కొనుక్కోవటం, కొంతమంది దాచుకున్న ఆ డబ్బులు పెట్టి తల్లిదండ్రులకి పండగరోజున ఏవో చిన్న బహుమతులు కొనటం మామూలుగా చూస్తూనే వున్నాం. ఒకవేళ పిల్లలు పెద్దవాళ్ళు చెప్పిన మాట వినని సందర్భాల్లో అదొక శిక్షలా ఆ ఎలవెన్సులు కొన్ని రోజులు ఆపేస్తారు. అలాగే పిల్లలు హైస్కూ

లుకి వచ్చేసరికీ, చిన్న చిన్న పనులు చేసి వాళ్ళ డబ్బులు వాళ్ళే సంపాదించుకుంటారు. చుట్టుపక్క ఇళ్ళల్లో లాన్‌మోవ్ చేయటంలాటి దగ్గర మొదలు పెట్టి, షాపుల్లోనూ రెస్టారెంట్లలోనూ కొన్ని కంపెనీలలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తారు. ఇలాటివి చిన్నప్పట్నించీ చేయటం వల్ల లాభాలున్నాయి. వాళ్ళకి కావలసిన డబ్బులు సంపాదించుకోవటం ఒకటి. ఇతరులతో ఎలా మాట్లాడాలి, ముఖ్యంగా కష్టమర్లతో ఎలా మాట్లాడాలి, ఏదన్నా చిన్న చిన్న వాదాలు వస్తే ఎలా పరిష్కరించాలీ అన్నవి అనుభవం మీద తెలుసుకుంటారు. ఇంతకు ముందు ఒకసారి అనుకున్నాం, అమెరికాలో ఏ షాపుకి వెళ్ళినా చిరునవ్వులో పలకరిస్తారని. అది ఒకళ్ళు చెపితే అప్పటి కప్పుడు వచ్చేదికాదు. అలాగే చిన్నప్పటినించే డబ్బు విలువ, సంపాదించటంలో వున్న తృప్తి అర్థమవుతాయి. చాలవరకూ స్కాలర్‌షిప్పుల మీదో ఉద్యోగాలు చేసో అప్పుచేసో చదువుకుంటారు కానీ తల్లిదండ్రుల డబ్బుల మీద ఆధారపడరు.

మా అమ్మాయిని, చిన్నప్పుడు, నేను రోజూ 7:30 కల్లా స్కూల్లో దించి ఆఫీసుకి వెళ్ళేవాడిని. ఒకరోజు బయల్దేరబోతుండగా ఎదురింటి ఎలిజబెత్ పిన్ని గారు వచ్చింది. "మా కారుకి ఏమొచ్చిందో కానీ, ఇవాళ కదలనంటున్నది. మా ఈసాని స్కూల్లో దించగలరా?" అనడిగింది. మా అమ్మాయి ఈసా మంచి స్నేహితులు. ఒకటే క్లాసు. "దాందేముంది.ఎక్కమనండి" అన్నాను.

"పెట్రోలు ఖర్చు నేను ఇస్తాను. ఫరవాలేదా?" అంది ఆవిడ.

నేను నవ్వి "అదో పెద్ద ఖర్చుకాదు. అదీకాక నేను అటే వెడుతున్నాను. మీరు ఏమీ ఇవ్వక్కర్లేదు" అన్నాను.

ఆవిడ కూడా నవ్వి, "ఈసారి మీ అమ్మాయిని నేను స్కూల్లో దించుతానులెండి" అంది.

ఇది ఎందుకు వ్రాశానంటే, అమెరికాలో సాధారణంగా ఎవరూ మన ఋణం వుంచుకోటానికి ఇష్టపడరు. అమెరికన్ స్నేహితులతో బయట తినటానికి వెడితే, బిల్లు ఇచ్చేటప్పుడు రెండు రకాలుగా ఇస్తాం. మొత్తం బిల్లు ముప్ఫై అయిదు డాలర్లయితే మేం నలుగురం టిప్‌తో కలిపి తలా పది డాలర్లూ బల్ల మీద పడేస్తాం. అలాకాక ఏ ఇద్దరమో వెడితే, "ఈసారికి నేనిస్తాను. వచ్చేసారి నువ్వు ఇద్దువుగాని" అనుకుంటాం ఇద్దరం.

అమెరికాలో ఒక సామెత వుంది. యు డోంట్ గెట్ వాట్ యు డిసర్వ్. యు గెట్ వాట్ యు నెగోషియెట్ అని. ఇది జీవితంలో నూటికి రెండువందలపాళ్ళు నిజం. అందుకని ఆ నెగోషియేషన్ని దూరం నించి చూస్తే "నాకేమిటి లాభం?" అనుకునే అవకాశంవుంది. ఇక్కడ ఇంకో విషయం గురించి చెప్పటం నా బాధ్యత. అమెరికన్లలో ఇంకొకళ్ళకి సహాయం చేయటం, ఏది అవసరమైనా వెంటనే ఇవ్వటం, ఆ "షేరింగ్ అండ్ కేరింగ్" అన్నది ప్రతిచోటా, ప్రతిరోజూ బాగా కనిపిస్తుంది.

మా ఆఫీసులో కెవిన్ అనే అతను ప్రతి సంవత్సరం కొన్ని రోజులు పేదలకి ఇళ్ళు కట్టే ప్రాజెక్ట్‌లో తిరుగుతుంటాడు. ఇల్లు కట్టటం అంటే, కొంతమంది తమ స్వహస్తాలతో పూర్తిగా ఇల్లు కట్టటం. అమెరికా పాత ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్

మొదలుపెట్టిన "హేబిటాట్ ఫర్ హ్యూమానిటీ" అనే స్వచ్ఛంధ సేవాసంస్థ ద్వారా ఈ పనులు చేస్తాడతను. ఒకసారి అతనితో నేనూ వెళ్ళాను. పునాదులు తవ్వటం దగ్గరనించీ, రాళ్ళు అందించటం కిటికీలు పెట్టటం ఎవరేం చేయగలరో అది. పొద్దున్న ఎనిమిదింటికి మొదలు పెట్టి, సాయంత్రం ఆరుదాకా చేశాం. ఇలా చేస్తున్నప్పుడు కొంతమంది వాలంటీర్ల పిల్లలు తినటానికీ తాగటానికీ అవసరమైనవి కూడా అందిస్తుంటారు. ఇది అమెరికాలో అన్ని పట్టణాలలోనే కాకుండా, జిమ్మీ కార్టర్ స్ఫూర్తితో, మిగతా చాల దేశాల్లో కూడా చేస్తున్నారు. అలాగే జెర్రీ లూయిస్ అనే పాత సినిమానటుడు ప్రతిసంవత్సరం లేబర్ డే వారాంతంలో, మస్క్యులర్ డెస్ట్రొఫీ అనే రోగ నివారణకోసం రీశెర్చి చేయటానికి కొన్ని మిలియన్ డాలర్లు వసూలు చేస్తాడు. మా కంపెనీవాళ్ళు, ఇండియాతో ఏమీ సంబంధం లేకపోయినా గుజరాత్ లో భూకంపం వచ్చినప్పుడు చాల మంచిపని చేశారు. ఉద్యోగస్తులెవరైనా ఆ నిధికి చందా ఇచ్చినప్పుడు, మా కంపెనీకూడా అంత డబ్బు ఇచ్చింది. అంటే నేను వంద డాలర్లు ఇస్తే, మా కంపెనీ ఇంకో వంద డాలర్లు కలిపి, రెండు వందలు పంపించిందన్న మాట. ఇక్కడ కొన్ని కుటుంబాల్లో, వాళ్ళకి ఇద్దరు ముగ్గురు పిల్లలు వున్నా, బంగ్లాదేష్, ఇండియా, వియత్నాం, కొన్ని ఆఫ్రికన్ దేశాలనించి అనాధ పిల్లల్ని తెచ్చుకుని పెంచుకోవటం సాధారణంగా జరుగుతూ వుంటుంది.

రువాండా, ఇథియోపియాలాటి దేశాల్లో ఏ కష్టాలు వచ్చినా, అమెరికా నించి వెళ్ళే ధన సహాయం చెప్పుకోదగ్గదే. అమెరికన్లకి డబ్బులున్నాయి కనుక ఇస్తారనేది కుంటిసాకు. డబ్బులున్నవాళ్ళందరూ ఇవ్వరు లేనివాళ్ళుకూడా ఇస్తారు. అదీకాక అమెరికన్లకి డబ్బులు చెట్లమీద కాయవు. (మా దొడ్లో నాలుగు చెట్లున్నాయి). ఎంతో కష్టపడి సంపాదించుకుంటున్నవే ఆ డాలర్లు.

మా వూళ్ళో నేనూ నా శ్రీమతీ చేసే ఒక ఉడుత సాయం, గొప్ప కోసం కాదు, ఇలాటివి ఎలా వుంటాయో చెబుదామని వ్రాస్తున్నాను. ప్రతి సంవత్సరం "అమెరికన్ కాన్సర్ సొసైటీ"వారూ, "అమెరికన్ హార్ట్ అసోషియేషన్"వారూ మా వూళ్ళో ఒక "వాక్" నిర్వహిస్తారు. అంటే దాదాపు పది కిలో మీటర్లు నడుస్తామన్న మాట. దాన్లో పాల్గొనటానికి మనిషికి పది డాలర్లు కడతాం. అంతేకాక మన స్నేహితులు తెలిసినవాళ్ళూ ఒక్కొక్క మైలుకి ఒక డాలర్ అనో, రెండు డాలర్లు అనో స్పాన్సర్ చేస్తారు. ఆ వచ్చిన డబ్బుని ఆ అసోషియేషన్లకి చందాలాగా ఇస్తామన్న మాట. వీటిల్లో పాల్గొనే వాళ్ళెంతమందో తెలుసా? కనీసం వెయ్యో, రెండు వేలమంది. ప్రతిసారీ కనీసం లక్ష డాలర్లయినా పోగవుతాయి. దీన్లో పాల్గొనే వాళ్ళు కూడా చాల సరదాగా నడుస్తూ, ఆ మంచిపనిలో భాగం పంచుకుంటారు.

అయితే వీళ్ళందరూ ఎందుకు చేస్తున్నారివన్నీ?

వీళ్ళకి ఏమిటి లాభం?

* * *